క్లుప్తంగా

వైభవంగా జ్యోతుల మహోత్సవం

కొలిమిగుండ్ల: తొగటవీర క్షత్రియుల ఆరాధ్యదైవమైన చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉగాది పండుగను పురస్కరించుకుని కోటపాడులో గ్రామపెద్దలు, తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రా మంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రెండు జ్యోతులను తయారు చేసి తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ భక్తి పాటలు ఆలపిస్తూ గ్రామ వీధుల మీదుగా ఆలయానికి చేరుకున్నారు. జ్యోతుల మహోత్సవాన్ని తిలకి ంచేందుకు గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఉమామహేశ్వరుని సేవలో కాటసాని



నందీశ్వరుడిని దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఏకశిలారూపంలోని శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ ఆవరణలో ఉన్న నందీశ్వరుడిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అందరూ కలిసి మెలసి ఉండాలి



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: మండల ప్రజలందరూ సోదరభావంతో కలిసి మెలసి ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఆయన్ను తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చల్లా వారిని ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ఆవుల శ్రీధర్ నాయిడు

బేతంచెర్ల: డోన్‌కు చెందిన వ్యక్తి ఆర్టీసీ బస్సులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ రమేష్ బాబు వివరాల మేరకు.. డోన్ కొండపేటకు చెందిన ఆవుల శ్రీధర్‌నాయుడు (52) స్టేట్ బ్యాంక్‌లో మెసెంజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆరేళ్ల కుమారుడితో కలిసి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలోని సుంకులమ్మ దర్శనం కోసం బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బేతంచెర్లలోని డోన్ క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. డోన్ చేరుకోగానే శ్రీధర్ నాయుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుమారుడు కండెక్టర్ వద్దకు వెళ్లి తన తండ్రి లేవట్లేదని తెలిపాడు. కండెక్టర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



బనగానపల్లె: ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



సంజామల: రంజాన్ విశిష్టతను తెలియజేస్తున్న మతపెద్ద



కొలిమిగుండ్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అవుకులో..

భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

- ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు
- ప్రవక్త బోధనలు వినిపించిన మత పెద్దలు
- ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

కోవెలకుంట్ల: ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని బనగానపల్లె నియోజకవర్గంలోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మార్చి 1వ తేదీ నెలవంక కనిపించడంతో 2వ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభమైంది. నెల రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం ఆదివారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో పట్టణాలు, గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి ఆయా గ్రామాల సమీపాల్లో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోవెలకుంట్ల పట్టణంలోని 10 మసీదుల నుంచే కాకుండా గుంజలపాడు, పెద్దకొప్పెర్ల, వెలగటూరు, అమడాల, ముదిగేడు, సౌదరదిన్నె తదితర గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది ముస్లింలు స్థానిక ముదిగేడు రహదారి పక్కన ఉన్న ఈద్గా వద్ద ప్రార్థనలు(దువా) చేశారు. మత పెద్దలు యాసిన్ మౌలానా, ముజాయిత్ మౌలానా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొలిమిగుండ్ల/అవుకు: మండలంలోని కొలిమిగుండ్ల, తిమ్మనాయినపేట, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, పెట్నికోట, తుమ్మలపెంట, బందార్లపల్లె, హనుమంతుగుండం తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. పలువురు దానధర్మాలు చేశారు. అవుకులోని జామియా మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు.



కోవెలకుంట్ల: ఈద్గా వద్ద దువా చేస్తున్న ముస్లింలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం, నందవరం, పలుకూరు, యనకండ్ల, వెంకటాపురం, అప్పలాపురం, జిల్లెల్ల, ఇల్లూరుకొత్తపేట, పసుపల, జ్వాలాపురం, మీరాపురం తదితర గ్రామాల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనాలు చేశారు. బనగానపల్లెలోని ఈద్గాల వద్ద ముస్లింలు భారీగా తరలివచ్చి ప్రార్థనాలు చేశారు. పలువురు ముస్లింలు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద బనగానపల్లె, నందివర్గం ఎస్‌ఐలు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బయ్య పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ మాసం ప్రత్యేకత, ఖురాన్, మహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపించారు. ప్రార్థనల అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బేతంచెర్ల: మండల వ్యాప్తంగా రంజాన్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ముస్లింలు కొలుములపల్లె రహదారిలోని ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. మండల ఖాజీ నూర్ అహ్మద్ రంజాన్ విశిష్టతను వివరించారు. అసూయ, రాగద్వేషాలను వీడి ఇతరులకు సాయం చేయాలన్నారు.

ప్యాపిలి: మండల కేంద్రంలోని ముస్లింలు ఉదయాన్నే స్థానిక దర్గాకట్ట నుంచి తక్బీర్ పఠిస్తూ ఈద్గాకు చేరుకున్నారు. మండల ఖాజీ, హఫీజ్ మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో సామూహిక ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ మాసంలో అనుసరించిన ఉపవాసాల ద్వారా పేదల ఆకలి బాధలు తెలుసుకోవాలన్నారు. దానధర్మాలు చేసేకొద్దీ సంపద రెట్టింపు అవుతుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ ముస్లింలు నల్ల రిబ్బన్‌లు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.



డోన్: ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



బేతంచెర్ల: సందేశం వినిపిస్తున్న మండల ఖాజీ



బేతంచెర్లలో ప్రార్థనలు



ప్యాపిలిలో..



డోన్: ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఘనంగా కానాల సుంకులమ్మ తిరునాల



సుంకులమ్మ సుదర్శనానికి పోటెత్తిన భక్తులు,



పోచా శీలారెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

సంజామల: ఉగాది పండుగను పరస్కరించుకుని సోమవారం కానాల గ్రామంలో సుంకులమ్మ పరమేశ్వరిదేవి తిరునాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, నేవైద్య సమర్పణ చేసి కర్పూర హారతులు ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి వైఎస్సార్‌సీపీ నేత పోచా శీలారెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

రాతిదూలం పోటీలు..

కానాల సుంకులమ్మ తిరునాల సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. వివిధ ప్రాంతల నుంచి 15 జతల వృషభాలు వచ్చాయి. కార్యక్రమంలో కూడాల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా సాగుతున్న బండలాగుడు పోటీలు

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



కోవెలకుంట్ల నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

కోవెలకుంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకిస్తూ పట్టణ శివారులోని ఈద్గా వద్ద సోమవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుత ఆందోళన చేపట్టారు. మాజీ వార్డు సభ్యుడు అక్బర్‌బాషా మాట్లాడుతూ..ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం సవరణ చట్టానికి అనుకూలంగా ఉందని ఆరోపించారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం నాయకులు నౌషాద్, రఫీ, ఇర్షాద్, బాషిద్, నూర్ పాల్గొన్నారు.

సంజామల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సంజామలలో ముస్లింలు నిరసన తెలిపారు. ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం మత పెద్దల ఆధ్వర్యంలో మసీద్ నుంచి ఈద్గా వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. రంజాన్ ప్రార్థనల అనంతరం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అమీర్‌సాబ్, మౌలాన అన్వర్, గాజుల రియాజ్, మక్బుల్ ఉస్సేన్, పక్కీర్‌సాహెబ్, దస్తగిరి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పలాపురం గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్ భార్య షేక్ అఫ్సాన అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. ఈ నెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అఫ్సాన తిరిగి రాలేదు. బంధువులు స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదు. ఆమె తల్లి షేక్ రమిజాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైవింగ్ కళాశాలను పూర్తి చేయాలి



డోన్ రూరల్: కొత్తకోట గ్రామ సమీపంలో ప్రభుత్వ డ్రైవింగ్ కళాశాల నిర్మాణా న్ని పూర్తి చేయాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ, రామచంద్రనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాలను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో బేగరిపేట కాలనీవాసుల నిరసన

బేతంచెర్ల: పట్టణంలోని బేగరిపేట కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం కాలనీవాసులు నిరసన తెలిపారు. నెల నుంచి నీరు సక్రమంగా రావడం లేదని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైనా తాగునీరు వదిలినా కొళాయిలకు రావడం లేదని కాలనీకి చెందిన రాధమ్మ, శిరిష, పుల్లమ్మ అన్నారు. తాగునీటి కోసం పనులు మానుకుని పక్క కాలనీలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ఇంటి పన్నులు చెల్లించమని తెలిపారు. దీనిపై నగర పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా కాలనీకి వచ్చే బోరు బావుల్లో భూగర్భజలాలు ఇంకిపోవడంతో తాగునీటి సమస్య నెలకొందన్నారు. ప్రత్యామ్నాయంగా మరో బావి నుంచి నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కమనీయం.. చెన్నకేశవుని కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

బనగానపల్లె రూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహా మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో వధూవరులుగా అలంకరించారు. వేద మంత్రాలు, డోలు వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు



బండలాగుతున్న వృషభాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సోమవారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 8 జతల వృషభాలు పాల్గొన్నాయి. రైతులు, యువకుల ఈలల, కేరింతల మధ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో హుసేనాపురం సంజీవుడు వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ, తృతీయ స్థానాలను రంగాపురం గ్రామానికి చెందిన కిలారి తిమ్మయ్య, ఆకుల శేఖరప్ప వృషభాలు కైవసం చేసుకున్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.6 వేలు, ద్వితీయ రూ. 4వేలు, తృతీయ రూ. 2 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.



అవుకు-3 గ్రామ సచివాలయం పక్కనే పేరుకుపోయిన చెత్త



ఎంఈఓ, వెలుగు కార్యాలయాల వెనుక మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు



పశువైద్యశాల పక్కనే పేరుకుపోయిన చెత్త

అంతా చెత్తమయం..!



రైతు భరోసా కేంద్రం పక్కనే..

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు చెత్తకు నిలయాలుగా మారాయి. ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ అంటూ హడావుడి చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఎక్కడి చెత్త అక్కడే ఉంది. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారుల నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రజలకు అవగాహన కల్పించే మాట అటుంచితే...ఆ అధికారులు విధులు నిర్వహించే ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆ చెత్తాచెదారాన్ని చూసి స్వచ్ఛత ప్రజలకేనే ప్రభుత్వ కార్యాలయాలకు ఉండదా అంటూ చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఎంఈఓ, వెలుగు కార్యాలయాలు, అమ్మవారిశాల సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వెనుక, తాడిపత్రి రహదారిలోని పశువైద్యశాల పక్కన, అవుకు-3 గ్రామ సచివాలయం, ఆర్బీకేల వద్ద చెత్త పేరుకుపోయాయి. అధికారులు ముందు తమ కార్యాలయాలను శుభ్రం చేసి ఆ తర్వాత ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తే బాగుంటుందని పలువురు వ్యంగాస్త్రాలు సంధిస్తున్నారు.

– అవుకు

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



అరవింద్ (ఫైల్)

డోన్ టౌన్: భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. డోన్ కొండపేటకు చెందిన మంగలి మల్లికార్జున కుమారుడు మంగలి అరవింద్(23) 11 నెలల క్రితం పులివెందులకు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాలేదనే మనస్థాపంతో ఆదివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. మంటలకు తాళలేక వీధిలోకి పరిగెత్తి రావడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.